
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 58 వ భాగం

### దక్ష ప్రజాపతి – 7

### సతీదేవి త్యాగం

క్రితం వ్యాసంలో శివుడి గురించి చెప్తూ ఆయన శ్మశాన వాసి అనీ, లయకారుడనీ, నువ్వేమో గొప్పవాడిననీ అనుకోకు అని చెప్పింది కదా సతీదేవి తండ్రితో? ఈ సందర్భంలో శివుణ్ణి లయకారుడిగా చెప్తూ అమ్మవారు ఎంత పతివ్రతో స్తుతించడం శంకర భగవత్పాదులు సౌందర్యలహరి శ్లోకంలో చూడవచ్చు.

విరించిః పంచత్వం వ్రజతి, హరి రాప్నోతి విరతిం
వినాశం కీనాశో భజతి, ధనదో యాతి నిధనం
వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా
మహాసంహారేస్మిన్ విహరతి సతి త్వత్పతిరసౌ [సౌందర్యలహరి. 26]

అమ్మా, భైరవీ, మహాప్రళయం సంభవించినప్పుడు బ్రహ్మ పంచత్వం పొందుతున్నాడు. శ్రీహరి విశ్రాంతి తీసుకుంటున్నాడు. యముడు నాశనమౌతున్నాడు. కుబేరుడి ధనం అంతా పోయి కాలధర్మం చెందుతున్నాడు. ఇంద్రాది దేవతలందరూ కన్నుమూస్తున్నారు. కానీ నీ భర్త సదాశివుడు విశృంఖలుడై స్వేఛ్ఛగా విహరిస్తున్నాడు.

ఇదే విషయం వామనావతారం మొదట్లో చదువుకున్నాం. శుక మహర్షి వామనావతారం మొదలుపెడుతూ, "యోగీశరూపుడై .." అంటూ వేరు వేరు కాలాల్లో శ్రీహరి ఎవరెనెవరిని ఎక్కడ ఎలా నియమిస్తాడో, అవన్నీ కూడా తానే అయినట్టూ చెప్పి చివరికి అంటాడు 'విష్ణుడవ్యయుండు విమల చరిత' ఆంటూ. అంటే ఏ దేవతకైనా సరే కాల పరిమితి అనేది ఉంది కానీ పరమేశ్వరుడికి అటువంటి పరిమితులు లేవు. అందుకే ఆయన ఆద్యంతాలు లేని భగవంతుడు. అదే పోతన చెప్పినది – జన్మమరణాది నివర్తకుండగు నభవునకి, ప్రవృత్తి నివృత్తి కర్మలు లేని పరబ్రహ్మ స్వరూపుడికి – ఇవేమీ లేవు. అటువంటివాడినా అలా శపించి అవమానించడం?

ఉ. నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా?
చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననన్ మది సిగ్గు పుట్టెడి

న్నేల ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్
గాలుపనే? తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగన్. [4-94]

లోక కల్యాణం కోసం ఎవరూ నివారించలేని హాలాహలాన్ని తాగి నీలకంఠుడయ్యాడు కదా శివుడు? ఆ శివుణ్ణి నిందించిన నీకు కూతుర్నై పుట్టడం చాలదా? ఆ మాట తలుచుకుంటూంటేనే సిగ్గు వేస్తోంది. ఎంచి చూస్తే, మహాత్ములకి అపకారం (ఎగ్గు) చేసే అటువంటి నీలాంటి వారి జన్మలెందుకు కాల్చడానికా?

చ. వర వృషకేతనుండు భగవంతుఁడు నైన హరుండు నన్ను నా
దరపరిహాస వాక్యముల దక్షతనూభవ యంచుఁ బిల్వ నేఁ
బురపురఁ బొక్కుచున్ ముదముఁ బొందక నర్మవచఃస్మితంబులం
దొఱఁగుదు; నీ తనూజ నను దుఃఖముకంటెను జచ్చు టొప్పగున్. [4-95]

[ఇంత జరిగాక ఇప్పుడు కనక తిరిగి కైలాసానికి వెళ్తే] హాసంతోనో, పరిహాసంతోనో శివుడు నన్ను 'దక్ష తనయా' అని పిలిస్తే, ఇక్కడ ఈ రోజు జరిగిన అవమానం గుర్తొచ్చి అలా పిలిపించుకున్నందుకు ఆనందం లేక, తొలగిపోవాలి. అలా అనిపించుకోవడం కంటే చావడం నయం.

తనకి జరిగిన అవమానం ఇంతవరకూ వచ్చింది కనక శివుడెంతటి వాడో సభా ముఖంగా అందరికీ తెలిసేలా దక్షుడితో చెప్పి, సతీదేవి శరీరం త్యాగం చేయడానికి నిశ్చయించుకుంది. అదే జరుగుతోందిప్పుడు. ఇంత జరిగినా ఒక్కరు కూడా అడ్డుకుని వద్దు అని కానీ, అభ్యంతరం చెప్పడం కానీ చేయలేదు. అంటే "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా..." అనేది దక్ష యజ్ఞంలో జరగలేదు ఎంతమంది బ్రహ్మ వేత్తలు అక్కడున్నాడనేది లెక్కపెట్టుకుని చూసినా. దానివల్లే చివరకి మొత్తం సర్వ నాశనం కాబోతోంది. ఆ సర్వనాశనానికి బీజం సతీదేవి దేహ త్యాగం చేయడం.

వ. అని యిట్లు యజ్ఞసభా మధ్యంబునం బ్రతికూలుండగు దక్షు నుద్దేశించి పలికి కామక్రోధాది శత్రువిఘాతిని యగు సతీదేవి యుదఙ్ముఖి యయి జలంబుల నాచమనంబు చేసి శుచియై మౌనంబు ధరియించి జితాసనయై భూమియం దాసీన యగుచు యోగమార్గంబునం జేసి శరీరత్యాగంబు చేయం దలంచి. [4-96]

అలా అన్నాక దక్షుడికి వ్యతిరేకీ, కామ క్రోధాలు అనే అంతః శతృవులని నాశనం చేసే సతీదేవి తూర్పు దిక్కుగా తిగి ఆచమనం చేసి మౌనంగా నేలమీద కూర్చుని యోగ మార్గం ద్వారా శరీరత్యాగం చేయడానికి పూనుకుంది. అయితే ఇంత చెప్పినా దక్షుడి నోట ఒక్కమాట లేదు; అంటే ఆయనకున్న క్రోధం అర్ధం చేసుకోవాల్సిందే.

సీ. వరుసఁ బ్రాణాపాన వాయునిరోధంబు;
గావించి వాని నేకముగ నాభి
తలమునఁ గూర్చి యంతట నుదానము దాఁక;
నెగయించి బుద్ధితో హృదయపద్మ
మున నిల్పి వాని మెల్లన కంఠమార్గము;
నను మఱి భ్రూమధ్యమున వసింపఁ

జేసి శివాంఘ్రి రాజీవ చింతనముచే;
నాథునిc దక్క నన్యంబుc జూడ [4-97]

తే. కమ్మహాత్ముని యంక పీఠమ్మునందు
నాదరంబున నుండు దేహంబు దక్షు
వలని దోషంబునను విడువంగc దలcచి
తాల్చెc దనువున ననిలాగ్ని ధారణములు. [4-97.1]

వ. ఇట్లు ధరియించి గతకల్మషంబైన దేహంబు గల సతీదేవి నిజయోగ సమాధి జనితం బయిన వహ్నిచేc దత్క్షణంబ దగ్ధ యయ్యె; అంత.
[4-98]

ప్రాణ అపానాలనబడే వాయువులను నిరోధించి, వాటిని ఉదానస్థానం వరకూ, అక్కడనుండి హృదయ పద్మంలోనూ నిలిపి, మెల్లగా కంఠ మార్గంలోంచి భ్రూమధ్య భాగానికి చేర్చి, మనస్సులో శివుని పాదాలని ధ్యానిస్తూ అతన్ని తప్ప మరొకటేదీ తలచక తన దేహాన్ని విడిచిపెట్టాలని నిర్ణయించుకొని, యోగాగ్నిని రగుల్కొల్పింది. అలా దక్షుడి వల్ల కలిగిన కల్మషం అయిన దేహాన్ని నిజ యోగ సమాధిలో జనించే అగ్నితో చేర్చి ఒక్క క్షణంలో దగ్ధమైంది.

క. అది గనుcగొని "హాహా"ధ్వని
వొదలcగ నిట్లనిరి మానవులుc ద్రిదశులు "నీ
మదిరాక్షి యకట దేహము
వదలెc గదా! దక్షుతోడి వైరము కతనన్." [4-99]

ఇదంతా చూస్తున్న మానవులు, దేవతలూ (త్రిదశులు) అన్నారు.అయ్యో ఈ సతీదేవి దక్షుడి మీద వైరంతో తన దేహాన్ని విడిచింది కదా అని హాహారవాలు చేసారు.

సీ. "సకల చరాచర జనకుc డై నట్టి యా;
దక్షుండు దన కూర్మి తనయ మాన
వతి పూజనీయ యీ సతి దనచే నవ;
మానంబు నొంది సమక్ష మందుc
గాయంబు దొఱcగంగc గనుcగొను చున్నవాc;
డిట్టి దురాత్ముc డెందేనిc గలcడె?
యనుచుc జిత్తంబుల నాశ్చర్యములc బొంది, ;
రదియునుc గాక యి ట్లనిరి యిట్టి [4-101]

తే. దుష్టచిత్తుండు బ్రహ్మబంధుండు నయిన

యీతఁ డనయంబుఁ దా నపఖ్యాతిఁ బొందు
నిందఁబడి మీఁద దుర్గతిఁ జెందుగాక!"
యనుచు జనములు పలుకు నయ్యవసరమున. [4-101.1]

సకల చరాచరాలకీ జనకుడైనప్పటికీ (ప్రజాపతి కదా?) దక్షుడు తనచేత అవమానం పొందిన సతి ఇలా అగ్నిలో దగ్ధమవడం చూస్తూనే ఉన్నాడు కానీ ఏమీ చేయలేదు. ఇంతటి దురాత్ముడు ఎక్కడైనా ఉంటాడా? ఇటువంటివాడు పేరుకి మాత్రం బ్రహ్మ బంధువని చెప్పవచ్చు. శీఘ్రంగా ఇతను అపఖ్యాతి పొంది తీరుతాడు.

క. దేహము విడిచిన సతిఁ గని
బాహాబల మొప్ప రుద్రపార్షదులును ద
ద్ద్రోహిం ద్రుంచుటకై యు
త్సాహంబున లేచి రసిగదాపాణులునై. [4-102]

అయితే అక్కడే ఉన్న ప్రమథగణాలు సతి దేహం విడవడం చూసి రుద్ర ద్రోహి అయిన దక్షుణ్ణి చంపడానికి కత్తులూ (అసి) గదలు తీసుకుని యుద్ధానికి లేచారు.

క. ఆ రవ మపు డీక్షించి మ
హారోషముతోడ భృగుమహాముని క్రతు సం
హారక మారక మగు ' నభి
చారకహోమం ' బొనర్చె సరభసవృత్తిన్. [4-103]

మొదట్లో చెప్పినట్టూ, సదస్యుల తప్పు ఇందులో లేదు. ఇదంతా దక్షుడికీ రుద్రుడికీ ఉన్న గొడవ అనుకుంటే. ఈ గొడవవల్ల వీళ్లందరూ ప్రయాగలో యజ్ఞాలు, గంగలో స్నానాలు చేసి పాపాలు పోగొట్టుకున్నారని చదివాం కదా? మరో సారి ఇలా జరక్కుండా ఉండడానిక్కాబోలు, భృగు మహర్షి 'అభిచార హోమం' అనేది చేసి యజ్ఞాన్ని నాశనం చేయబోయేవాళ్ళమీదకి వదలడానికి సిద్ధమయ్యేడు.

వ. ఇట్లు దక్షిణాగ్ని యందు వేల్చిన నందుఁ దపం బొనర్చి సోమలోకంబున నుండు సహస్ర సంఖ్యలు గల 'ఋభు' నామధేయు లైన దేవత లుదయించి బ్రహ్మతేజంబునం జేసి దివ్య విమానులై యుల్ముకంబులు సాధనంబులుగా ధరియించి రుద్రపార్షదులయిన 'ప్రమథ' 'గుహ్యక' గణంబులఁ బాఱందోలిన వారును బరాజితులైరి; తదనంతరంబ నారదు వలన నభవుండు దండ్రిచే నసత్కృతురా లగుటం జేసి భవాని పంచత్వంబునొందుటయుం 'బ్రమథగణంబులు' 'ఋభునామక దేవతల' చేఁ బరాజితు లగుటయు విని. [4.104]

అలా చేసిన హోమం వల్ల, సోమలోకంలో ఉండే ఋభులనే దేవతలు బ్రహ్మ తేజస్సుతో మండుతున్న కొరివిలతో (యుల్ముకంబులు) వచ్చి ఈ ప్రమథ గణాలని ఆటకాయించారు. అక్కడితో వాళ్ళు ఓడిపోయి యజ్ఞశాలలోంచి వెళ్ళిపోయారు. నారదుడి వల్ల ఈ కథంతా – సతీదేవి తండ్రిచేత అవమానింపబడడం శరీరత్యాగం (పంచత్వం పొందడం), ప్రమథ గణాలు ఋభులనే దేవతల వల్ల పరాజితులవడం – విన్నాడు శివుడు.

ఇప్పటివరకూ పోతనలో పరమశివుడి భక్తుడు శివుడెంతటివాడో సతీదేవి నోటితోనే చెప్పించాడు కదా. ఇక్కడ్నుంచి ఆ శివభక్తుడు బయటకొచ్చి తాండవం చేస్తూ అద్భుతమైన పద్యాలలో అసలు సిసలు వీర రసం కురిపించడం చూస్తాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS